# కాశ్మీర్ | నెరవేరని ప్రజల ఆకాంక్షలు

**జమ్ము** – కాశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వ కూటమి నుండి బిజెపి తప్పుకోవటంతో పిడిపి – బిజెపిల ప్రభుత్వం పేకమేడలా కూలి పోయింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి మరే ఇతర పార్టీ లేదా పార్టీలకూటమి ముందుకు రాకపోవటంతో రాష్ట్రంలో గవర్నరుపాలన అమలులో వుంది.

కాశ్మీర్‌లో ఈ పరిణామాలు ఆకస్మికమైనవీ కావు; ఆశ్చర్యపోవలసినవీ కావు. 2015 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో పిడిపి, బిజెపిలు రెండూ పరస్పర వ్యతిరేక ధృవాలుగా వున్నాయి. ఒకరిని ఓడించటానికి మరొకరు శాయశక్తులా ప్రయత్నించారు. హిందూ మతతత్త్వ, విభజన వాద బిజెపి రాజకీయాలకు వ్యతిరేకంగా కాశ్మీర్ ప్రజల ఆకాంక్షలకు తాను ప్రతినిధిగా పిడిపి ప్రకటించుకుంది. అయితే అధికార పీఠాన్నెక్కడానికి తగిన సంఖ్యాబలం పిడిపికి లభించలేదు. కనుక, అధికారంలోకి రావటంకోసం తనకు బద్ధశత్రువుగా ప్రకటించుకున్న బిజెపితో ఒప్పందానికి సిద్ధమైంది. బిజెపితో తన అవకాశవాద పొత్తును సమర్థించుకోవటానికి పిడిపి నాయకత్వం దానికి పవిత్ర ఉద్దేశ్యాలను ఆపాదించింది. కాశ్మీరీ ప్రజలకు సేవజేయడానికి ప్రస్తుతమున్న పరిస్థితులలో బిజెపితో జతకట్టటమే సరైనచర్యగా అది పేర్కొంది. అయితే, అధికారం కోసం తమను మోసగించినట్లుగా కాశ్మీరీ ప్రజలు ఈ పరిణామాన్ని గ్రహించారు.

కూటమికి– ప్రభుత్వ ఏర్పాటేగాక, ఉమ్మడి ఎజెండా రూపకల్పన చాలా కష్టమైన అంశాలుగా సాగాయి. పిడిపి నాయకుడు ముఫ్తి మహ్మద్ సయీద్ మరణం, పిడిపి – బిజెపిలమధ్య సంబంధాలలో సమస్యలను మరింత పెంచాయి. మెహబూబా ముఫ్తి అధికార పీఠాన్ని ఎక్కడానికి, ప్రభుత్వానికి ఒక ఉమ్మడి ఎజెండా రూపొందించ డానికి బిజెపి నాయకత్వంతో బేరసారాలాడటానికి అనేక నిద్రలేని రాత్రులు గడపడంతోపాటు, అవమానకరమైన అనేక అలసిపోయే కసరత్తులు చేయాల్సి వచ్చింది. కాశ్మీర్ ప్రజల ఆకాంక్షలకోసం నిలబడతామన్న మాటపై ప్రజలకు తమ ముఖమెట్లు చూపాలనేదే పిడిపి నాయకత్వం ముందు ఆనాడు ఎదురైన ప్రశ్న. ప్రభుత్వంలో కీలకస్థానాలను పొందడమెట్లా, కూటమిలో భాగస్వామ్యమైన పిడిపిని నిరంతరం అదుపులో వుంచుతూ అధికారాన్ని ఉపయోగించుకొని కాశ్మీర్‌లో తన మద్దతుపునాదిని విస్తరించి సంఘటిత పరచటమెట్లా అనేది బిజెపి ముందున్న ప్రశ్న. బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వమే కేంద్రంలో వుండటమనేది జమ్మూ కాశ్మీర్‌లో బిజెపికి కలిసివస్తోంది.

**ఈ తెగదెంపులు దేనికి?**

“జమ్ము కాశ్మీర్ కూటమిలో కొనసాగటం దుస్సాధ్యమైంది.” “...కూటమిలో ప్రధాన భాగస్వామి (పిడిపి) రాష్ట్రంలో పరిస్థితిని నియంత్రించలేక పోతోంది. జమ్ము, లడఖ్‌లలో అభివృద్ధి పథకాలకు అవరోధాలు కూడా సృష్టించబడ్డాయి” అని పిడిపితో బంధాలను తెగదెంపులు చేసుకుంటున్నట్లుగా ప్రకటించే సందర్భంగా బిజెపి ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్ 2018 జూన్ 19న మాట్లాడాడు.

“కండబలాన్ని ప్రయోగించే విధానం జమ్ము కాశ్మీర్‌లో పనిచేయదు; లేదా విజయం పొందలేదు. మేము రాష్ట్రాన్ని శత్రుభూభాగంగా పరిగణించలేము” అని తన రాజీనామా సమర్పణ అనంతరం మెహబూబా ముఫ్తి పేర్కొంది.

బిజెపి ప్రభుత్వం నుండి బయటకు రావటానికి తమ కారణాలు ‘కీర్తించేటంత విలువైన’వని, అలాంటి “కారణాలతో బయటకు రావడాన్ని గర్వంగా భావిస్తోంద’ని పిడిపి నాయకుడు మొహమ్మద్ ఖుర్షీద్ ఆలమ్ పేర్కొన్నాడు. “వాస్తవానికి పాకిస్థాన్‌తో, విభజనవాదులతో చర్చలు జరపాలని; రాళ్ళు రువ్వినవారిపై కేసులను తొలగించాలని; భూతలంపై కాల్పుల విరమణను అమలు పరచాలని; పరిస్థితిని చక్కబరచటానికి, చర్చలను ఫలప్రదం చేయటానికి తగిన చర్యలు తీసుకోవాలని మెహబూబా ముఫ్తి డిమాండ్ చేయటమే ఈ తెగదెంపుల వెనుక కారణం” అని ఖుర్షీద్ ఆలం పేర్కొన్నారు.

ఈ ప్రకటనలు, వ్యతిరేక ప్రకటనలు కొన్ని వాస్తవాలను వెల్లడి చేయటంతో పాటు కొన్ని వాస్తవాలను మరుగు పరుస్తున్నాయి. అదేవిధంగా ప్రస్తుత సంక్షోభానికి కారణాన్ని ఒకరిపై ఒకరు ఆపాదించుకోవటాన్ని తెలియజేస్తున్నాయి.

మూడున్నర సం॥ల పిడిపి– బిజెపి కూటమి పాలనలో కాశ్మీర్ ప్రజలు ఘోరమైన నిర్బంధాన్ని అనుభవించారు. ఏఎఫ్ఎస్‌పిఏ వంటి ప్రత్యేక అధికార చట్టాలతో కేంద్ర ప్రభుత్వ సాయుధ బలగాలు ప్రజలపై ఈ కాలంలో విచ్చలవిడిగా దాడులకు తెగబడ్డాయి. టెర్రరిస్టు వ్యతిరేక దాడులుగా చెప్పబడుతోన్న ఈ చర్యలలోను, నిరసనోద్యమాలతో వ్యవహరించే సందర్భంగానూ, సాయుధ బలగాలు తుపాకులను, పెల్లెట్స్‌ను స్వేచ్ఛగా ప్రజలపై ప్రయోగించారు. సాయుధ పోలీసులు రాష్ట్రంలో ఎప్పుడైనా, ఎక్కడైనా ఒక బాలుడిని అరెస్టు చేసినా, కాల్చి చంపినా వందల, వేల సంఖ్యలో ప్రజలు నిరసన తెలుపుతూ వీధుల్లోకి రావటం; పోలీసు కాల్పులలో మరణించిన వారి అంత్యక్రియలలో భాగం పంచుకోవటం; ప్రజలపై ఈ తరహా నేరాలకు పాల్పడిన పోలీసు అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయటం – కాశ్మీర్‌లో సాధారణ లక్షణంగా మారిపోయింది. 2016లో జరిగిన భారీ నిరసనోద్యమంలో పాల్గొన్న ప్రజలు సీసాలతో సాయుధ బలగాలతో తలపడ్డారు. నిరసన ప్రజానీకంపై విచక్షణా రహితంగా పెల్లెట్లను ఉపయోగిస్తున్న కేంద్ర సాయుధ బలగాలను ఎదుర్కొన్నారు. యువ మిలిటెంట్ నాయకుడైన బుర్హాన్ వానీని సాయుధ బలగాలు కాల్చి చంపటం, ప్రజల హృదయాలలో భయానికి బదులుగా మరింత ధిక్కార స్వభావాన్ని, ఆగ్రహావేశాల్ని రగిల్చింది.

2018 జనవరిలో జమ్ములోని కథువాలో 8 సం॥ల బాలిక అపహరణ, అత్యాచారం, హత్యకు గురైన ఘటన బిజెపి మరియు హిందూత్వ శక్తుల కుట్రపూరిత చర్యగా బట్టబయలైంది. ప్రజలను మత ప్రాతిపదికపై విభజించి, ఒక విభాగపు ప్రజలను జమ్మూ

వదలి వెళ్ళేవిధంగా భీతావహులను చేయటం దీని ఉద్దేశ్యం. ఈ నేరంలో హిందూ మతతత్వ శక్తుల పాత్ర, నేరస్థులకు బిజెపి మంత్రులు సిగ్గులేకుండా బహిరంగంగా మద్దతుగా నిలవటం– బిజెపిని విస్తృతంగా వెల్లడిచేశాయి. ఈ నీచమైన నేరానికి వ్యతిరేకంగా కాశ్మీర్ వ్యాపితంగానే గాక, దేశ వ్యాపితంగానూ, ప్రపంచంలోని వివిధ చోట్ల ప్రజలు, ప్రజాస్వామికశక్తులు నిరసనాందోళనలు నిర్వహించారు.

**ఓటి పడవలోనే రెండు పార్టీలు**

ప్రజలపై జరిగిన ఈ నేరాలన్నింటిపట్ల పిడిపి నాయకత్వం, మౌన ప్రేక్షకుడిగా వుండడం లేక విచారణలకు ఆదేశించటం, కేసులు నమోదు చేయటం, కొందరు బంధితులను విడుదల చేయటం వంటి కొన్ని కంటితుడుపు చర్యలకు పరిమితమైంది. రంజాన్ సందర్భంగా కాల్పుల విరమణ పాటించాలని ముఫ్తిమహమ్మద్ ప్రతిపాదించింది కూడా. వివిధ మిలిటెంట్ గ్రూపులన్నింటితోను, అలాగే పాకిస్థాన్‌తోను చర్చలు జరపటంద్వారా కాశ్మీర్ సమస్యకొక పరిష్కారం కనుగొనాలని ప్రతిపాదించింది. సమస్యలోతుల్లోకి వెళ్ళటానికి ఇదేమాత్రమూ తోడ్పడదు. అంతేగాక కాశ్మీర్ ప్రజల హక్కుల గురించి, వారి ఆకాంక్షల గురించి తన అవగాహన ఏమిటో బయటకు చెప్పేందుకు ఆమె ఏనాడూ ప్రయత్నించలేదు.

కాశ్మీర్ ప్రజల హక్కులను, ఆకాంక్షలను నిరాకరించే బిజెపి విధానం పట్ల జమ్ము, కాశ్మీర్ ప్రజలు చాలా స్పష్టతతో వున్నారు. భారత ప్రభుత్వ అణచివేత విధానానికి బిజెపి గాఢంగా కట్టుబడి వుంటుందని ప్రజలకు తెలుసు. ఈ విధానాలను మతప్రాతిపదిక పై విభజించే రాజకీయాలతో బిజెపి మిళితం చేస్తోంది.

"రాష్ట్రంలో పరిస్థితి ఎలా వున్నదంటే మా బలమైన రెండు నియోజకవర్గాలు మాకు దూర మయ్యాయి. 2019వరకు ఈ కూటమి ఇలాగే కొనసాగటం మినహా మరోమార్గంలేదు. జమ్ము, లడఖ్‌లలో మాకు ఓటువేసిన ప్రాంతాలనుండి మాకు గట్టి ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. అలాగే కాశ్మీర్‌లోయ వ్యాపితంగా పిడిపి వ్యతిరేక పవనాలు కుదిపివేస్తున్నాయి. 2019 ఫిబ్రవరిలో సార్వత్రిక ఎన్నికల ప్రకటనకు బాగా ముందుగా సెప్టెంబర్– అక్టోబర్‌లలోనే కూటమి ప్రభుత్వాన్ని పడద్రోయాలనే ఒక ఆలోచన చేశాం. మొదట ప్రభుత్వాన్ని పడద్రోసిన తదనంతరం మా భూమికను మేము పునరుద్ధరించుకోగలమన్న విశ్వాసం ఇప్పటికీ మాకుంది" అని కాశ్మీర్‌కు చెందిన ఓ సీనియర్ బిజెపి నాయకుడు పేర్కొన్నాడు.

ఇద్దరూ చిల్లులు పడిన ఓటి పడవలో ప్రయాణిస్తున్నారనేది వాస్తవం. బిజెపి ఆ పడవ నుండి ముందుగా దూకి బయటపడింది. తెగదెంపులు చేసుకునే సమయంలో తమను ఆవిధమైన పరిస్థితిలో వుంచిన వాస్తవ కారణాలను చూడటానికి మాత్రం ఇద్దరూ నిరాకరిస్తున్నారు.

**తర్వాత ఏమిటి?**

కాశ్మీరీ ప్రజల పక్షాన నిలిచినందుకు, కాశ్మీర్ సమస్య పరిష్కారం కోసం నిలిచినందుకు అధికారం కోల్పోవలసివచ్చినా లెక్కచేయని 'త్యాగధనుని'లా తనను తాను చూపుకుంటూ కోల్పోయిన మద్దతు స్థావరాన్ని తిరిగి పొందటానికి పిడిపి ప్రయత్నించ వచ్చు. అయితే అది ఫలించదు. బిజెపితో తన అవకాశవాద కూటమిని గురించి ఒప్పించే విధంగా పిడిపి నాయకత్వం వివరించలేదు. ప్రజలు కూడా దానిని నమ్మబోరు. ఎందుచేతనంటే కాశ్మీర్ ప్రజల నిజమైన ఆకాంక్షలకు, వారి హక్కులకు ప్రాతినిధ్యం వహించే ఒక విధానాన్నే పిడిపి స్వీకరించలేదు.

"ఈ స్థానంలో మేము నాలుగంచెల వైఖరిని ముందుకు తెస్తాము. 1) టెర్రరిస్టులను కఠినంగా అణచివేయటం, 2) చట్టపరమైన పద్ధతుల్లో టెర్రరిస్టుల చర్యలను నిరోధించటం, 3) సమాజం లోని వివిధ విభాగాల ప్రజలతో కలగలవటం, 4) అభివృద్ధిపై దృష్టిని కేంద్రీకరించటం అని బిజెపి నాయకుడు రాంమాధవ్ ప్రకటించిన మాటలద్వారా కాశ్మీర్‌లో బిజెపి భవిష్యత్ కార్యాచరణ స్పష్టమవుతోంది. ఈ వైఖరి గవర్నరు పాలనలోనూ కొనసాగుతుందని ఆయన ప్రకటించారు.

"మనం ప్రభుత్వం నుండి బయటకు వస్తున్నామంటే, మనం రాష్ట్రాన్ని వదలిపోతున్నామని అర్థం కాదు. కేంద్రమే రాష్ట్రాన్ని పరిపాలిస్తుంది. రాష్ట్ర ప్రతినిధిగా గవర్నరు రాష్ట్రాన్ని పాలిస్తాడు" అనికూడా ఆయన ప్రకటించారు.

రాష్ట్రంలో అధికారంలో వుండటం ద్వారా కాకుండా దొడ్డిదోవన రాష్ట్ర ప్రభుత్వాన్ని నడపడం ఇదొక తప్పుడు పద్ధతి. కూటమినుండి వైదొలగటం ద్వారా బిజెపి తన బాధ్యతలనుండి స్వేచ్ఛ పొందింది. టెర్రరిజంపై పోరు ముసుగులో కాశ్మీర్ ప్రజలకు వ్యతిరేకంగా క్రూర నిర్బంధం ప్రయోగించే విధానాన్ని ప్రత్యక్షంగా చేపట్టటం నుండి విముక్తమయింది. ఈ విధానం సంక్షోభాన్ని మరింత పెంచి, కాశ్మీర్ ప్రజలకు– భారత పాలకులకు నడుమ గండిని మరింత పెంచేది మాత్రమే. భారత పాలకులు, బిజెపి నాయకులు తమ విధానం శిఖరస్థాయి తప్పిదంగానూ, తమకే తిరిగి ముప్పు తెచ్చేదిగానూ రుజువు చేస్తుందని తప్పక తెలుసుకుంటారు.

ప్రస్తుత రాజకీయ సంక్షోభం నుండి ఎన్నికల ద్వారా ప్రయోజనాన్ని, ఫలితాలను పొందాలని ఆసక్తి కనబరచే కాశ్మీర్‌లోని ప్రతిపక్ష పార్టీలేవైనా, కాశ్మీర్ ప్రజలకు పెద్దగా ప్రయోజనం చేకూర్చలేవు. తీవ్రతరం కానున్న దాడులతో బెదిరింపులకు గురై, ఎన్నో కష్టాలలో కాశ్మీర్ ప్రజలున్నారు. వారి న్యాయమైన సుదీర్ఘకాలంగావున్న సమస్యలకు ఒక సమంజసమైన పరిష్కార విధానం కలిగివుండే, ప్రజలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా నిలబడే – ఖచ్చితమైన వైఖరి, నిర్దిష్ట కార్యాచరణ కలిగివుండే రాజకీయ శక్తులు కాశ్మీరీ ప్రజలకు నిజమైన అర్థంలో సహకరించగలుగుతాయి. కాశ్మీరీ ప్రజలు తమ భావాలను, ఆకాంక్షలను వ్యక్తం చేయటానికి, తమ భవితవ్యాన్ని నిర్ణయించు కోవటానికి అవసరమైన ప్రజాస్వామిక, శాంతియుత పరిస్థితులను గ్యారంటీ చేయడం ద్వారా మాత్రమే, కాశ్మీర్ సమస్యకు న్యాయమైన, స్థిరమైన పరిష్కారం కనుగొనగలుగుతామని కాశ్మీర్‌లోనూ దేశవ్యాపితం గానూ రాజకీయ, ప్రజాస్వామ్య శక్తులు గుర్తించి తీరాలి.

oooo